చలి కొక దుప్పటి,
గిలి కొక దుప్పటి,
మనిషి కొక దుప్పటి,
మనసు కొక దుప్పటి,
ముసిలోడికి వచ్చిన దేది,
వచ్చినా రాని దేది?

# కొత్త దుప్పటి...

ఎస్. వెంకటరామిరెడ్డి

నెల రోజులైంది చలి మొదలై.

భోజనాలై మంచా . లెక్కేనరికే మంచులో తడిసిన గాలి బరువుగా మనుమల్ని ఆక్రమించుకొంటోంది.

కళ్ళాల నిండా తూరు పెత్తని ముడి గింజల కుప్పల్ని దుప్పులై ఆక్రమించుకొనేందుకు మంచు సన్నాహం చేస్తోంది.

కుప్ప కుప్పకూ కావలాగా ఓ మంచం.

కళ్ళాలలో ఇంకా నద్దుమణగలేదు. వల్పటి మజ్జిగ లాంటి వంచమి చంద్రుని కాంతిలో కొందరు భోంచేస్తున్నారు. ఇంకొందరు లోకాభిరామాయణాలు బిగ్గరగా చర్చించుకొంటున్నారు. కొన్ని కళ్ళాలలో తల్లుల వెంట ఇంటి కెళ్దామని పిల్లలు మారాం చేస్తున్నారు.

విసిరేసినట్టు దూరంగా ఉన్న కళ్ళంలో కుక్కిమంచంమీద కూచుని ఉన్నాడు రామయ్య తాత.

చెప్పలేదంటనక పొయ్యేరూ... నరులార గురునీ జేరి మొక్కిన బతక నేర్చేరూ" అంటూ వీరబ్రహ్మంగారి తత్త్వాన్ని తన్మయంగా వణికే కంఠంతో పాడుకొంటున్నాడు.

మధ్య మధ్యలో 'ఖళ్... ఖణేల్' మని దగ్గు.

ఊర్లో వీధి కుక్కలకు యుద్ధం మొదలైనట్లుంది.

గింజల కుప్ప వక్కనే చిన్నసైజు కొండలా గడ్డి కుప్ప. ఇంకా వామి వేయలేదు.

దొంగ మనుమలకు లాగే దొంగ గొడ్లకూ కావలా కాయాలి.

కొందరు తెల్లారుజామున పాలు పిండుకోగానే దొంగ గడ్డికోసం బర్రెల్ని తలుళ్ళు విప్పుతారు. అవీ వాటి శక్తివంచన లేకుండా కడుపు నింపుకొస్తాయి. బంధించి బందెలదొడ్డికి తోల్దామంటే చేతులకు దొరకవు.

మనిషి లేస్తున్న చప్పుడైతే చాలు జింకలా వరువెడతాయి.

అందుకే జాగ్రత్తగా కూచుని ఉన్నాడు తాత.

అల్లు డొచ్చేంతవరకు మధ్య మధ్యలో కర్రతో మంచంకోడు కేసి చరుస్తూ 'ఛేయ్' అని గాల్లోకి అరుస్తూ బర్రెల్ని హెచ్చరిస్తున్నాడు.

రామయ్య తాతకు కొడుకులు లేరు. దూరవు చుట్టా న్నొకణ్ణి ఇంట్లో ఉంచుకొని ఒక్కగా నొక్క కూతు ర్నిచ్చి యావదాస్తీ వట్టం కట్టాడు.

అడుగుల చప్పుడైంది.

"ఎవురూ?" అటుకేసి చూస్తూ ప్రశ్నించాడు.

"నేనేలే!" అల్లుడు ఓబన్న గొంతు.

"బువ్వ దెచ్చినం తాత!" నెత్తిన అన్నం గిన్నెతో అయిదేళ్ళ సుబ్బలక్ష్మి తాత వద్ద కొచ్చింది.

"మా తల్లే! మా యమ్మే! ఏం బువ్వ నాయనా? బరిగె బువ్వా?" నెత్తిమీదున్న గిన్నె అందుకొంటూ అడిగాడు.

"కాదు 'ఆ బువ్వ'."

"కూరో?"

"పైటేలదే!"

"నద్దికూరా..." నిరాశ ధ్వనించింది ఆయన గొంతులో.

"పూట పూటకు ఉడుకుది ఎట్టొచ్చదే? తిను. పొద్దుబోయింది." గడ్డి కుప్ప వక్కనున్న కడవలోంచి చెంబులోకి నీళ్ళు వంచి తెచ్చిస్తూ అన్నాడు ఓబన్న.

చేయి కడుక్కొని అన్నం కలుపుకొంటోంటే సుబ్బలక్ష్మి అంది - "కూర అయిపోయిందే తాత! అందు..."

"మ్మేయ్! ఇట్రా... తాతను బువ్వ దిన్నీ!" ఓబన్న కసరుకొనేసరికి నోర్మూసింది.

అన్నం తిని, గిన్నెలు మంచం కిందకు తోసి, తలవైపున్న వడక చుట్టను మంచమంతా వరిచాడు. కాళ్ళకట్టకు చాల్లేదు అది. నాలుగు గోనెనంచులు వరువులాగ కుట్టి పైన పాత వంచె వేసిన వడక అది.

"నేనూ నీకాన్నే తాత..." అంటూ తాతకన్నా ముందే మంచంమీద వడి రెండు గెంతులేసింది సుబ్బలక్ష్మి.

"సు వ్వీడికి రా! తాత నొక్కన్నీ వండుకోనీ..." ఓబన్న చెప్పాడు.

"నే న్రాను. తాతకాన్నే వండుకొంటా... తాత మంచి మంచి కతలు సెబుతడు."

"రమ్మంటుంటే..." గద్దించాడు.

"నే న్రాను..." ఏడుపుగొంతుతో అంది.

"ఈడనే వండుకోనీరా అబ్బీ - నీ కిబ్బంది ఏమొచ్చె." రామయ్య తాత అన్నాడు.

"గోము నేరువుతండవ్... గోము..." వడక సరిజేసుకొంటూ గొణిగాడు ఓబన్న.

"నీ కాడుండే దుప్పటి ఇట్ల పారెయ్‌రా అబ్బీ! ఇది సింపిర్ది. ఇద్దరికీ సాల్దు."

"నిద్దరబోనీలే... ఆ యమ్మినే యీడికి దెచ్చుకొంటా!" మంచంమీద వొరుగుతూ చెప్పాడు.

"రొండు కొయ్యలు అడ్డుంచి ఇంత గడ్డి దానిమీద గూడాల యేసింటే ఇంత నలి ఉండకపోను. వొళ్ళు బరువాయే." గొణుక్కున్నాడు తాత.

"తాత! కత జెప్పవూ..." గోముగా అంది సుబ్బలక్ష్మి.

"పెద్దోని కానించి జా బొచ్చిందిరా అబ్బీ?"


"ఆ..." కుప్ప కావల బీడి ముట్టించుకొంటూ ఓబన్న.

"అక్కడ మంచి బొచ్చు దుప్పట్లు సిక్కుత యంట. నాకోటి వంపుత నన్నెడు. ఏమన్నా రాసిండా?"

"వంపలే..."

అంతవరకు వెలిగిన ఆశ తున్నున ఆరింది. "ఈ నలికాలం దాటేది గగనం." గొణుక్కున్నాడు.

"బొచ్చు దుప్పటంటే... నల్లగా... బొచ్చు



## గమనించు

"ఏమండీ! వండక్కి మంచి వట్టు చీర కొంటానని చెప్పారు కదా, షాపింగ్‌కి వెళ్దామా?" అడిగింది భార్యామణి.

"వద్దు. వక్కింటి మీనాక్షి ఎదురింటి సుజాత ఏమైనా తెచ్చుకున్నారా, లేదా గమనించి చెప్పు." సలహా ఇచ్చాడు భర్త.

ఎల్.పి. చంద్ర [ధర్మవరం]

బొచ్చుగా ఉండేదా తాత?'' సుబ్బలక్ష్మి అడిగింది.

''ఆ... అదేనే... ను వ్వెప్పుడు జూసినవ్?''

''మన...'' చెప్పకముందే-

''మ్మేయ్. లచ్చుమ్మా! నోర్మూసుకొని పండుకొంటవా? నే న్రావాల్నా? పొద్దుబోయింది నిద్దర బొమ్మంటే యాం దా మాటలు?'' కోపంగా అరిచాడు ఓబన్న.

నోర్మూసుకొంది సుబ్బలక్ష్మి.

''తెల్లారుజామున నలికి తట్టుకోలేం.'' మెల్లిగా గొణుక్కొంటూ చింపిరి దుప్పటి మీదకు లాక్కున్నాడు రామయ్య తాత.

** ** **

ఎవరో దొంగ గొడ్లను అదిలిస్తున్న చప్పుడు.

ఉలికిపాటుగా లేచాడు రామయ్య తాత.

అన్ని కళ్ళాల వాళ్ళూ కేక లేస్తున్నారు.

పరువెత్తే బర్రె కాలి గిట్టల చప్పుడు ఆ కళ్ళాల మధ్య లయగా వినిపిస్తోంది. మధ్య మధ్యన ఆగి నిశ్శబ్దాన్ని పరుస్తోంది.

వెన్నెల లేదు. అంత చీకటి.

కళ్ళ కేమీ కనిపించట్లేదు - శబ్దం తప్ప.

కర్ర అందుకొని మంచంకోడు కేసి బాదుతూ గట్టిగా అదిలించాడు తాత - తమ కల్లం వద్దకు రాకుండా.

కరిమబ్బు కాటుక చీకట్లో మరీ నల్లని చీకటి ముద్దలా ఉన్న బర్రెని పోల్చుకొని కొందరు యువకులు బడితెలతో వెంబండించారు.

బర్రె గొడవ సద్దుమణిగింది.

కొద్దిసేపు దొంగ గొడ్లను వదిలే యజమానుల్ని గురించి తిట్ల వర్షం మొదలైంది.

అదీ ఆగింది.

మంచంమీద వొరగబోతుండగా అనుమాన మొచ్చింది తాతకు.

'సందేల పడుకొంది... మంచంమీద లేదు. నిద్దర్లో కిందకు దొర్లిందేమో?' అటువైపు తిరిగి చూశాడు.

నేలమీద లేదు.

'నిద్దరబోగానే తీస్కపొయ్యిన ట్టుండడు.'

'ఇంత గొడవ జరిగినా నిద్ర ర్లేవలేదు మొద్దునాయాలు' అనుకున్నాడు.

మెల్లిగా లేచి కర్ర తాటించుకొంటూ గడ్డి కుప్ప తిరిగి ఓబన్న మంచం కేసి నడిచాడు.

కర్రతో తడివి మంచాన్ని గుర్తించాడు.

మంచంమీద నల్లగా ఆవరించి ఉన్న దుప్పటి.

''అబ్బీ ఓబన్నా!'' మంచంకోడు కేసి కర్రతో తడుతూ పిల్చాడు.

దుప్పటి తొలగింది.

ఎదురుగా తాతను చూడగానే అంత దుప్పటి ఓవైపుకి దిగజారింది.


పిల్ల న్దెచ్చినవా?''

''ఆ...''

''ఇంత మొద్దు నిద్దరైతే ఎట్టబ్బీ! బర్రె లొచ్చి కళ్ళాలన్నీ గందరగోళం జేసె. ను వ్వింగా మునుగు దియ్యలేదు. జాగర్తగా బండుకో!'' అంటూ వెనుదిరిగాడు.

కిందకు జారిన దుప్పటిని అందుకొన్నాడు ఓబన్న.

** ** **




జాము పొద్దున్నించి నిద్ర రాలేదు తాతకు.

భరించరాని చలి.

చిరుగుల దుప్పటి మంచులో తడిసి ముద్దైంది. దాన్ని తాకాలంటేనే భయ మేస్తోంది.

చల్లదనం చెవుల్లోకి హోరుగా దూకుతోంది. మనిషిని ఉండలా ముడిచే చలి. కండలు కాల్చే చలి.

ఎక్కడా కుక్కలు అరవట్లేదు. ఏ జీవి కదలిక వినిపించట్లేదు.

ఉన్నట్లుండి దూసుకొచ్చిన వర్షపు జల్లుల్లా అప్పుడప్పుడు చలిగాలి కదలిక. అరికాళ్ళ నుంచి కొన జుట్టు దాకా తనువంత జలదరింపు తెస్తోంది. పళ్ళు సంగీతాన్ని ధ్వనిస్తున్నాయి.

చెట్లు మౌనంగా ఆకుల దోసిళ్ళతో మంచు ముత్యాలు రాలుస్తున్నాయి.

మంచం కింద ముడుచు క్కూచున్నా చలిపోటు ఆగటం లేదు.

మెల్లిగా చేతిని కదిల్చి పక్క జేబు తడివితే, సందేల నగం కాల్చి మిగుల్చుకొన్న బీడీ ముక్క తగిలింది.

అగ్గిపెట్టె లేదు. అల్లుణ్ణి అడగాలి. చలికి ముడుచుకు పడుకొన్న అతణ్ణి లేపాలంటే మనస్కరించట్లేదు.

బీడీ మీద ధ్యాస ఎక్కువైంది.

వణుకుడు మిక్కుటమయ్యే కొద్దీ బీడీ చివర్ల నుంచి పీల్చబడే చిరువేడి కోసం తహ తహ అధికమైంది.

మెల్లిగా వెళ్ళి లేపుదా మనుకొన్నాడు.

'ముసలి చాదస్తమని ఇసుక్కుంటడేమో?'

'బంగారంటి నిద్దర పాడైందని నొచ్చుకొంటడేమో?'

డోలాయమాన స్థితిలో చాలాసేపు అలాగే కూచున్నాడు.

జామెరిగిన తొలికోడి ఊరి మధ్య ఎక్కడో పిక్కటిల్లింది. చలి గుండెల్లోకి శూలంలా కూసింది.

ఓబన్న మంచంవైపు నుంచి 'సర్' మనే శబ్దం వినిపించింది. ఆ వెనకే సన్నని వెలుగు. క్షణాల తరువాత మళ్ళీ చీకటి.

''ఒరే అబ్బీ ఓబన్నా!'' పిల్చాడు తాత.

''ఓ...''

''అగ్గిరా అబ్బీ - బీడు ముక్క కాల్చుకోవాల.''

దమ్ము గట్టిగా లాగి వదిల్చాడు ఓబన్న. మంచంమించి లేస్తోంటే భుజంమీద వేలాడి వస్తోన్న దుప్పటిని అక్కడే వదిల్చాడు.

''ఇదో అగ్గిపెట్టె. పిల్ల నెత్తుకొని నే నింటికి బోతాండ. ఎద్దలకు మేతేసి నీళ్ళు దాపి వస్పా. సలిమంటేసుకో!'' అగ్గిపెట్టె తాత కిచ్చి వెనుదిరిగాడు.

సుబ్బలక్ష్మిని భుజా నేసుకొని, దుప్పటి భుజంమీద జీరాడుతుండగా కళ్ళంలోకి వచ్చాడు.

తాత బీడి ముట్టించుకొంటున్నాడు.

ఆ వెలుగులో నల్లగా నిగ నిగ లాడుతూ దుప్పటి.

వీపు చాటుగా దాన్ని మడచుకొన్నాడు గబుక్కున.

''పొద్దోనికి జాబు రాస్పారేమో బొచ్చు దుప్పటి అంపియ్యమని రాయరా అబ్బీ! సలికి సచ్చాండ.'' పళ్ళ మాకుళ్ళ మధ్య చెప్పాడు తాత.

'సూసిండేమో? గురుతు బట్టిందు గావాల...' అనుమాన మొచ్చింది ఓబన్నకు.

ఈ దుప్పట్నీ తాతకనే పంపిండు మిలిట్రీలోంచి పెద్దోడు. నల్లగా, నిగ నిగ లాడతా, కొత్త వాసన్తో... ఊరంతా వట్టి సూసినోల్లే. నోరార పొగిడినోళ్ళే... ముసలోడి పైనుంటే ఎవురన్నా సూసేదుందా? మెచ్చేదుందా? రొంద్రోజులకే పుల్లదుమ్ము నిండి... కంపు గొడతా... అందుకే ముసిలోడి కియ్యంది.

'ఈ నాల్రోజుల్లో ఆ సింకి దుప్పట్నీ ముసిలోడు సించక మానడు. ఆనక తన పాత దుప్ప టిస్పే ఆ దో ఏడా దుంటది. కాలం గడ్సిపోద్ది.'

'మొత్తానికి ముసిలోడు ఉపాయపోడే... కొత్త దుప్పటి కొట్టేయాలని సూసిండు.'

మెల్లిగా ఇంటి క్కదిలాడు ఓబన్న.

ఎద్దుల కింత మేతేసి అవి తినగానే, ఉడకబెట్టిన వేరు శెనగపిండి, రాగిపిండిని నీళ్ళలో కలిపి తాపాడు. గాడిని మార్చి మరో గాడికి కట్టేసి మరింత మేపేసి కళ్ళం వద్దకు కదిలాడు.

ఊర్లో అక్కడక్కడ కోళ్ళు కూస్తున్నాయి. ఒకదాన్ని విని మరొకటి గొంతు చించుకొంటున్నాయి. కమ్ముకొన్న నిర్వీర్యపు వాసనల్ని చెదరగొట్టేందుకు రెక్క లల్లార్చుతున్నాయి.

క్రమంగా 'కొక్కొరోకో'లు అంచె లంచెలుగా ఊరంత అలుముకొన్నాయి.



కళ్ళం కేసి చూశాడు ఓబన్న.

ఆశ్చర్య మేసింది. అక్కడ మంట కనిపించలేదు.

చిన్ని చిన్ని నిప్పురవ్వలు అటూ ఇటూ నేలమీద కదులుతున్నాయి - మంట స్థానంలో.

దగ్గర కెళ్ళేసరికి - చింకి దుప్పటి మునుగేసుకొని, బూడిద కుప్పలో నిప్పురవ్వల్ని కెలుకుతూ ముసిలోడు. ఆ కొద్ది వేడికోసం తహ తహ లాడుతూ అటూ ఇటూ తిరిగే అతని వేళ్ళు.

మం టెందుకు యేసికోనట్టా? పుల్లలు శానా కుప్పబోసి ఇచ్చిన్నే... అప్పుడే అయిపోయుంటయా? ఎట్టయిపోతయ్? పక్కగా చూశాడు. ఇంకొద్ది పుల్ల లున్నాయి.

వింతగా ఉంది ఓబన్నకు.

'మంటేసుకొందుకు పుల్ల లుండయ్. అగ్గె పెట్టుంది... మరి... నలికి వానికి సావాల్సిన కర్మేందీ?' అనుకున్నాడు. అతనికి తాత పరిస్థితేమిటో అంతబట్టకుండా ఉంది.

అంతలో వణకుళ్ళ మధ్య నోరు విప్పాడు రామయ్య తాత.

"ఈ పాతగుడ్డ కప్పుకొని నలలో పండుకోవాలంటే సాద్దెంగాలేదురా అబ్బీ! పెద్దోడు మిలిట్రీలోంచి కొత్త బొచ్చు దుప్పటి పంపుతా నన్నోడు. అ దొచ్చేదాక నా కీ అగసాట్లు తప్పేట్టు లేవు. అయినా... అందాక బతికే దెవురో, నచ్చే దెవురో?" అన్నాడు.

భుజాలు తడువుకున్నట్లైంది ఓబన్నకు. తెలుసేమో ముసులోడికి!'

ఏదో లీలగా అనుమానమై, తరువాత అర్థమైంది.

'ఇంత నలిలో కూడా సిదుగు లుండీ మండేసుకోలేదంటే... తను నలికి సావడం నేను కల్లారా సూడాలనీ, పాపమని కొత్త దుప్ప టిస్తే తీసుకోవాలనీ... అమ్మ ముసిలోడా! ఎంత ఎత్తేసినవురా!" అనుకున్నాడు.

'ముసిలోడి క్కూడా కొత్త దుప్పటే! సోకులు బోతండడు... సోకులు." కోప మొచ్చింది ఓబన్నకు.

"నాకేం గావాల - నలి కొక్క మంచి దుప్పటైతే సాలు. మడులా, మాన్నేలా?" స్వగతంగా అనుకున్నాడు రామయ్య తాత.

"నలి నలని సావకుంటే పొద్దు బొడ్సేదాకా నలిమం టేసుకొని కూసుంటే నేం? పుల్ల లుండయ్ గదా - నీ సొమ్మేం బోయె!" కోపంగా అన్నాడు.

"ఉండయ్... యేసుకొందామనే అనుకున్నా"

"మరి...?"

"ను వ్వొస్తవని..."

"నే నొస్తే?"

"ఇప్పటిదాకా నలిమం టేసుకొన్నా. ఇట్టనే యేసికొంటే పుల్లలు కొంచేపట్లో అయిపోతయ్. ను వ్వొస్తే... నలికి తట్టుకోలేవని మంటేయకుండా పుల్లలు మిగిలించినా. కూసుందువురా - మంటేసుకొందాం." అగ్గిపెట్టె చేతికి తీసుకొంటూ అన్నాడు రామయ్య తాత.

క్షణకాలం శరీరమంతా జలదరించింది ఓబన్నకు. అంతర్ముఖంగా మునుగేసి ఉన్న కొత్త దుప్పటి ఒకటి అప్రయత్నంగానే కుప్పలా జారి పడింది.

ముసిలోడు గీచిన అగ్గిపుల్ల మంటలో ఎండు చితుకులే గాకుండా, మ రెదో అంటుకున్నట్లుగా అనిపించింది. ★